# ఒట్టు

## ౧

బందరులో క్రొత్తగా యేర్పడిన నాట్యకళోద్ధారక సమితివారు ఒకనాడు సమావేశమై, తమ సమితి పక్షాన యిక ముందు ఆడబడే నాటకాల్లో స్త్రీలే స్త్రీ పాత్ర ధరించాలెనని తీర్మానించారు. ఈ తీర్మానం మొట్టమొదట ధైర్యంతో ప్రవేశపెట్టి, అడ్డుప్రశ్నలన్నింటికి సమాధానాలుచెప్పి నెగ్గినట్లు చేసినవాడు జగన్నాథం. జగన్నాథం ప్రతిపాదన నెగ్గగానే శర్మ మరియొక వేడివేడి తీర్మానం ఉపపాదించాడు. ఏమని? స్త్రీలు అభినయించాలి అనడం వట్టి తీర్మానమేగాకుండా క్రియారూపంగా చూపుటే సమితివారి ముఖ్యాశయం గనుక, మూడుమాసాల్లో సమితి సభ్యులు యావన్మందీ తమ స్త్రీలచే నాటక భాగాలు వల్లింపజేసి, వచ్చే వేసవి సెలవులలో తప్పకుండా మూడు నాటకాలు ఆడించితీరాలి అని. ఆ తీర్మానం గెలవడానికి పెటపెటలైంది. నాభార్య పసిబిడ్డతల్లి అనీ, నాభార్య పురిటికెళ్ళిందనీ - మా ఆవిడకు ఒంట్లో సుస్తీగా వుంటుందనీ, ఇంట్లో ఆడవాళ్ళ అభిప్రాయాలు కనుక్కోకుండా యిటువంటి తీర్మానాలు చేయడం తప్పనీ, నేను ఒప్పుకున్నా. పెద్దలు మా నాన్నగారున్నారు: వారు ఒప్పుకోరని; మాకు గోషాఅనీ; మా ఆడవాళ్లకు చదువురాదనీ, ఏవేవో కార

ణాలతో చాలమంది వ్యతిరేకించారు. పోలు తీసుకుంటే అనుకూలురు, ప్రతికూలురు సమానమైనారు. అధ్యక్షపీఠం వహించిన అనంతాచార్యులవారి తలయూపుతో తీర్మానం నెగ్గింది. కర్తవ్యం యేమిటని మనసుల్లో వితర్కించుకుంటూ సభ్యులు యిండ్లకు చేరుకున్నారు.

౨

ఆనాటి రాత్రి సమితి సభ్యులు తమతమ యిండ్లలో భార్యలతో యీ విషయం ప్రస్తావించారు. నడిరేయివరకూ యింటింటా వాగ్వాదాలు జరిగినవి. రెండవ తీర్మానము ప్రవేశ పెట్టిన శర్మభార్య. యీ విషయంతో భర్తను పూర్తిగా తిరస్కరించి "కళోద్ధారణమంటూ ఉద్యోగం సద్యోగం మానుకొని, ఇంట్లో భార్యా బిడ్డలను ఏడ్పించి మీరు తిరుగుతున్నదిగాక, ఇంకా నన్నుగూడా నాటకాలాడడానికి రమ్మంటున్నారా? ఏమైనాసరే ఆ వేషాలూ గీషాలూ నాచేతగావు మగవాళ్ళు భార్యా భర్తలుగా గూడ్డి ఆడుతుంటేనే నాకు సిగ్గుగా ఉంటుంది. అటువంటిది నేనా వేష మేయుడం? అయినా, ఈ నలుగురు బిడ్డల్నీ యెవరిపరంచేసి వెళ్ళేది? ఒకపిల్ల మంచినీళ్ళంటూ నిశరాత్రివేళ లేస్తుంది. ఒక పిల్ల వాకిట్లోకి పోతానంటుంది. ఈ పసివాడికి తెల్లవారే లోపల రెండుమాట్లు పాలుగలిపి పొయ్యాలే" అన్నది భార్య.

"పిల్లల విషయం నీ కక్కరలేదు. మనిషిని పెడ్తా" నన్నాడు శర్మ.

"కూలిమనిషి మనం దగ్గర లేకపోతే పిల్లల్ని బాగా చూస్తుందా?"

'నేనున్నానుగా?'

'మిమ్మల్ని బిడ్డలను చూడమని యింట్లో వుంచి, నేనెవడితోనో జతగూడి నాటకాలాడేది, ఎంత ముచ్చటగా ఉందండి మీ మాట!'

'అయితే ఏమి చేయమంటావు?'

'ఆ సమితి సభ్యత్వం వదులుకోండి.'

'అంతకంటే శిరచ్ఛేదం లేదు.

'మగవాళ్ళతో వేషాలేయడం నాకూ శిరచ్ఛేదమే.'

'అయితే నీవు నామాట వినవూ?'

'నన్ను క్షమించండి. విషము పుచ్చుకొని ప్రాణాలు విడువమంటే విడుస్తా. కాని, ఆ నాటకాల్లో వేషాలేయలేను. నన్నెందుకు దుఃఖపెడ్తారు' అని పెనిమిటి పాదాలమీద బడి భోరున ఏడ్చింది ఆమె. శర్మ తెల్లబోయినాడు.

3

నాయుడుగూడా తన భార్యతో యీ విషయం ప్రస్తావించాడు.

'ఇప్పటికే మన కులంవాళ్ళు మనకు ఘోషా లేదనీ, నాటకాలకు, సభలకు పోతుంటామనీ, సూటీలు పోటీలు అంటున్నారు. ఇక దీనిలోగూడా దిగితిమా నలుగురిలో తలెత్తలేము. ఆడపిల్లలుకలవాళ్ళు ప్రతిదానిలో విచ్చల విడిగా జొరబడితే పిల్లలకు సంబంధాలు రావు. అయినా నా వానాకాలపు చదువు మీ రెరుగరూ? పొడిముక్కలే కూర్చి చదువలేను. నాటక పద్యాలు నా వశమా?' అన్నది నాయుడుభార్య. నాయుడు ఊరుకున్నాడు. ఇంటింటా ఇట్లాగే మగవాళ్ళు అడగడం, ఆడవాళ్ళు 'మావల్లగా' దనడం జరిగిపోయింది, మొత్తంమీద ఏ సభ్యుని భార్యా ఈ విషయం ఆమోదించలేదు. జగన్నాథం మరో యెత్తేశాడు. ఏమంటే అసలు సంగతి భార్యయైన జానకితో ముందుగా చెప్పలేదు. రాత్రి భోజనాలైన తరువాత, ఆమె యిల్లు సర్దుకొని, పక్కలు వగైరాలు చూచుకొని, స్థిమితంగా తమలపాకుల పొందాను దగ్గిర పెట్టుకొని, కొంచెం వక్కపొడి పెనిమిటికిచ్చి కొంచెము తాను నోట్లో వేసుకొని, ఒక ఆకుకు సున్నం రాచి పెనిమిటికిస్తూ, ఒక ఆకు తాను వేసుకుంటూ ఉల్లాసంగా ఏమిటో ముచ్చటిస్తూ ఉండగా, జగన్నాథం 'జానకీ! నేనో పని చెప్పతాను చేస్తావా?' అన్నాడు.

'ఏపని?'

'ఏదోపని, చేస్తావా?'

'చేస్తానులే చెప్పండి.'

'లే అంటున్నావే; చెయ్యవేమో?'

'చేస్తానంటేనిగా, సంగతి చెప్పందే శంకిస్తే ఎట్లా?'

'శంకగా పలికితే శంకించాను.'

'శంకాలేదు గింకాలేదు, తప్పకుండా చేస్తాను. మీరేమంత చేయరాని పని చేయమనరుగదా?'

'... ... ... ...'

'ఎప్పుడైనా మీ ఆజ్ఞ అతిక్రమించానా, ఇప్పుడు అతిక్రమించడానికి?'

'అయితే ఒట్టేనా?'

'ఏమీ, మీకింకా నమ్మకంలేదూ? ఈశ్వరసాక్షిగా చేస్తా. ప్రమాణపూర్తిగా చెప్తతున్నా, ఎంతకష్టమైనా దీనికి తప్పను సరేగదా.'

'... ... ... ...'

'ఏదీ మీ చెయ్యి యిట్లా చాపండి' అని జానకి లేచి పడకకుర్చీలో కూర్చుని ఒడిలో చేతులు పెట్టుకొనియున్న భర్తచేతిని తానే అందుకొని 'మీరు చెప్పినట్టు చేస్తాను.' అని చేతిలో చెయ్యేసి 'ఏమి మీ శంక యిక తీరిందా? ఇక యేమి చెయ్యమంటారో చెప్పండి' అని పెనిమిటివంక చూచి నవ్వింది.

జగన్నాథానికి నోట మాటరాలేదు. సుప్రసన్నమైన అతని ముఖం దీనాతిదీనంగా అయిపోయింది.

'ఏం ఒట్టు?'

'నన్ను చంపుకున్నట్టేనా?'

'అబ్బా! అబ్బా! ఏమిటండీ మీ మాటలు? ఒట్టు పెట్టుకోటానికి యింతకన్నా ఏమీ దొరకలేదా.' జానకి కన్నుల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

'... ... ... ...'

'ఎంత విశ్వాసమును, ఎంత ప్రేమను, వెల్లడింప జేస్తున్నవి జానకి మాటలు. దానికి ప్రతిగా ఆమెయెడ నేను ఇటువంటి వంచనకు పూనుకొని ఈ విశుద్ధ ప్రేమమయిని, ఎంత మోసం చేస్తున్నాను? నేను చెప్పబోవు సమాచార మామెకెంత హృదయభేదకమోగదా! ముందుగానే ఆమెస్వేచ్ఛకు శృంఖలాలు తగిలించితినిగదా. ద్రోహిని: సతీ ద్రోహిని' అని తలచి లజ్జితుడై, దుఃఖితుడై, కుప్పలు కూలినట్లయి జానకికి జవాబు చెప్పకుండానే కుర్చీకి జేరగిలబడ్డాడు జగన్నాథం. పెనిమిటి ముఖవైవర్ణ్యం జానకికి భీతిగొలిపింది. గడగడ వణికిపోయింది. కన్నులు చెమ్మగిల్లినాయి. అతని ముఖంలో ముఖంపెట్టి తటాలునవంగిచూచి 'యేమి యిట్లా ఉన్నారే' మని ఆదుర్దాగా అడిగింది. ఈ లోపల జగన్నాథంలో గూడా

కొంతమార్పు కలిగింది. 'ప్రారంభవిద్య మొదలుకొని ప్రణయ వ్యవహారాలవరకూ స్త్రీలకు స్వాతంత్ర్యం చవిచూపాలనే మతంవాడినిగదా నేను. ఈ మాత్రపు సంసారానికే యింత వేలతనం చూపితేయెట్లా? ముందుగాచెప్తే యేస్త్రీగూడా ఒప్పుకోదు. కాబట్టి కొంత మోసం, కొంత అధికారం ప్రయోగించైనా వాళ్లకు స్వేచ్ఛనేర్పాలె. ఇందులో అక్రమంలేదు' అని అతనికి తోచింది. కొంచెం ధైర్యం తెచ్చుకున్నాడు; కంఠం సవరించుకొన్నాడు. 'జానకీ' అన్నాడు.

'ఆఁ.'

'ఈ రోజున మా సమితిలో ఒక తీర్మానము ప్యాసు చేశాము.'

'ఏమనీ?'

'ఇకముందు మా సమితి పక్షాన ఆడబడే నాటకాల్లో స్త్రీ పాత్రను స్త్రీలే అభినయించాలెననీ, మునుముందు సమితి సభ్యులే తమ స్త్రీలచేత ఈ సంస్కారం ఆరంభింపజేయాలనీ, వచ్చే వేసవి శలవులలో మూడు నాటకాలిట్టివి ఆడాలనీ.'

'అయితే?'

'ఆ తీర్మానం ప్రకారం నా భార్యవైన నీవు నాటక భాగాలు వల్లించి నాటక ఖేలనంలో పాల్గొనాలె.'

'అసలు యీ తీర్మానం ప్రవేశపెట్టినవాడనే నేను.'

'మీా ఉద్దేశం?'

'కళాపోషణ'

'అయినా పాత్రధారణ ఐచ్ఛికమేగా! ఇష్టంలేని వాళ్ళను బాధించదుగదా!'

'ఐచ్ఛిక మనడానికి వీలులేదు.'

'అయితే మీారు నాకు ముందేచెప్పలేదేమి?'

'నీవు ఆమోదించవనే.'

'నిజమేకాని దురుద్దేశముతోకాదు. కళాభిమానంతో'

'సరేగాని నాయకపాత్ర మీారుధరిస్తారా?'

'నాకు కంఠసారస్యంలేదు. నాయక పాత్రధారణకు తగను. నీవు మృదుమధుర గాత్రవు. నీ వాక్పాటవమూ, నీ కంఠ మాధుర్యమూ, నిన్ను ఉత్తమ నాయికా పాత్రకు అర్హురాలినిగా చేయును. కాబట్టి ఆ పాత్రకు అర్హుడగు నాయకునితో కలిసి నీవు అభినయించాలె.'

'ఏమిటీ పరపురుషుడితోనా?'

'అవును,'

'అయ్యో, ఎంత మోసం చేశారండీ' అని జానకి గుండె కొట్టుకున్నది.

'అయితే అభినయించవూ?'

'ఎట్లా అభినయించక మానను? ఆ ఒట్టా యీ ఒట్టుగాదే. మీ ప్రాణంమీదనే ఒట్టు పెట్టారుగా మీకంటే నా కధిక మేమున్నది?'

జానకి కళ్ళవెంట నీళ్లొచ్చాయి. పమిట చెఱుగుతో తుడుచుకొని తలవంచుకొని క్రిందికి చూస్తూ ఉండిపోయింది. తన మోసకృత్యానికి తనలోతానే కుమిలిపోయినట్లయినాడు జగన్నాధం. నాలుగైదు నిమిషాలు నిశ్శబ్దంగా గడచిపోయి నాయి. 'అయితే పిల్లల గతేమి' టన్నది జానకి దుఃఖముతో పెనిమిటివంక చూస్తూ.

'వాళ్ళ సంగతి నేను చూచుకుంటా' నన్నాడు జగన్నాధం తలవంచుకొని.

జానకి పెద్ద నిట్టూర్పు విడిచి 'అయినదేమో అయింది. నేను మీ ఒట్టులో కట్టుబడ్డాను. మీరు నాకు మూడు వరాలివ్వాలి'

'ఏమిటవి?'

'రిహార్సల్సుకు రాను. ఈ ఊళ్ళో అభినయించను. మీరూ, పిల్లలూ వెంటరాకుండా పొరుగూళ్ళు పోను.'

'సరే.'

౪

సమితివారి మరునాటి సభలో సభ్యులెల్లరు, తమ భార్యలు రామన్నారనీ, వాళ్ళు రావడం తప్పనిసరైతే

తాము సభ్యత్వమే వదులుకుంటామనీ తమ అసమర్థతను వెల్లడించారు. జగన్నాథం ఒక్కడే తాను చేసిన ద్రోహం చెప్పకుండా తన భార్య పాత్రధారణ చేయడానికి ఒప్పుకున్న దని చెప్పి మిత్రుల అభివందనా లందుకున్నాడు. నాయికా పాత్రధారణ చేయగల యువతీమణి దొరికిందనగానే సభ్యులలో నవోత్సాహం ఉత్పన్నమైంది. మొదట తా మనుకున్న ప్రకారం సావిత్రీ, పాదుకా పట్టాభిషేకమూ - ఏలూరు, రాజమండ్రి పట్టణములలో ప్రదర్శించుటకు తీర్మానించు కున్నారు. ఆ మరునాడే నాటకం. పార్టులు జానకి సన్నిధికి చేరినవి.

'నా భర్త ఆజ్ఞ నాకు శిరోధార్యం. పతివ్రతా తిలకమగు సుమతి కుష్ఠురోగియగు పెనిమిటిని శిరమున నిడు కొని వేశ్యాంగనాగృహమునకు గొనిపోయినదట. అట్లాగే నేనుగూడా నా భర్త ఆజ్ఞను నిర్వహిస్తాను.' అని జానకి మన స్సులో దృఢనిశ్చయం చేసుకొని నాటకభాగా లందుకున్నది. తన అభీష్టం నెరవేర్చడానికి భార్య అంగీకరించినందుకు మహా సంతోషించాడు ప్రొఫెసర్ జగన్నాథం, ఎం. ఏ., ఎల్. టి.

౨

వేసవి సెలవులు ఇవ్వగానే సమితివారు నాటకాలాడ టానికి తట్టా బుట్టా కట్టుకొని బయలుదేరారు. వారితోబాటు సకుటుంబంగా జగన్నాథం బయలుదేరాడు. బెజవాడలో

యేర్పాట్లన్నీ జరిగాయి. వాల్ నోటీసు లంటించారు. ఊళ్ళో మేళతాళాలతో కాగితాలు పంచారు. తన పేరూ, భార్య పేరూ చేర్చి పెద్దపెద్ద అక్షరాలతో ముద్రించబడిన నోటీసులు చూచి జగన్నాథం ఏమనుకున్నాడోగాని జానకి చాలా మనస్తాపం చెందింది. ఎచ్చటనో ఉన్నచోటు యెఱుకబడకుండాఉండే తనను యీవిధంగా గోడలమీద, గొబ్బెలమీదా జట్కాబండ్లమీదా, రోడ్డుప్రక్కనున్న చెట్లమీదా ప్రకటన చేయిస్తున్న తన భర్తయొక్క ఉద్దేశమేమిటో ఆమె తెలుసుకోలేకపోయింది. కాని తన భర్త నా విషయమై యేమీ అడగలేదు.

రాత్రి ఎనిమిది గంటలయ్యేటప్పటికి టిఫిన్ క్యారియర్తో అన్నం వచ్చింది. పనిమిటికి, బిడ్డకూ అన్నంపెట్టి తానుగూడా తిని పిల్లవాడి నెత్తుకొనే అచ్చికి గూడా అన్నం పెట్టింది. బాబు అప్పటికే నిద్రపోతున్నాడు. అన్నంతినగానే లీలకూడా నిద్రబోయింది. తన పనులన్నీ అయిన తరువాత జానకి బాబును లేపి పాలిచ్చింది. పిల్లవాడిని యెత్తుకునే అచ్చితో 'అచ్చీ! అబ్బాయి లేస్తే లేచి వలఉయ్యాలలో పడుకోబెట్టి ఊపు' అని చెప్పింది. 'అమ్మాయి లేచి ఏడిస్తే బిసకట్లు బ్యాగులో ఉన్నాయి ఇవ్వండి. వేడినీళ్లు ఫ్లాస్కులో ఉంచాను. పిల్లవాడు లేచి పాలకేడిస్తే వేడినీళ్ళతో కలిపి పట్టండి. మఱచిపోయి చన్నీళ్ళలో కలిపేరుసుమండీ

బిడ్డకు జబ్బు చేస్తుంది. అసలే వాడికి పోతపాలు అలవాటు లేదు ఏమి తాగుతాడో ఏమో' అన్నది భర్తతో. భార్య చెప్పిన పాలడబ్బాలు, బిస్కట్లు యెక్కడెక్కడ ఉన్నవో చూచుకుంటున్నాడు జగన్నాథం. ఇంతలో వాకిట్లో కారు వచ్చిన శబ్దం, తోడనే హారన్ ప్రయోగించిన ధ్వని వినబడ్డది. జానకిని పిలుచుకొని పోవడానికి కారు వచ్చిందికాబోలు నను కొని జగన్నాథం కొంచెం చకితుడై నిలబడ్డాడు. ఒక మనిషి కారుదిగి వచ్చి 'నాటకం ఆరంభించబోతున్నారు. అమ్మ గారిని పిలుచుక రమ్మన్నా' రన్నాడు జగన్నాథంతో. జానకి అవతల గదిలో పిల్లవాడిపక్క చూస్తున్నది. జగన్నాథం భార్యవద్దకు పోయి 'జానకీ! కారు వచ్చింది. సిద్ధంగా ఉన్నావా' అన్నాడు. జానకి సిద్ధమే అనలేదు. కాని ఇట్లా జవాబిచ్చింది. 'మాంత్రికుడు సర్పమును కట్టుగట్టి నిల్పినట్లు నన్ను మీ పట్టుతో బంధించారు. మన మిరువురమూ నాయికా నాయకులుగా అభినయించే భాగ్యం కలిగినట్లయితే నా జీవితం యావత్తు నట్టువకత్తెగా గడపమన్నా చింతలేకుండా గడిపేదాన్నే. భగవంతుడు అటువంటి అనుకూల్యం కల్పిం చాడుగాదు. ఇతరుని భర్తగా భావించి అభినయించడమనేది మగనాలికి సామాన్యకష్టంగాదు. అదే నా మనస్సులో ఉన్న బాధ. అయినా మీ ఆజ్ఞను పాలించడం నా కర్తవ్యం. నమస్కారం. వెళ్లుతున్నా. బిడ్డలు జాగ్రత్త ...... అని జానకి బయలుదేరింది. వెలవెలపోవుచున్న ముఖంమీద

వికృతంగా కనబడుచున్న తెచ్చికోలు నవ్వుతో, భార్యకు వీడ్కోలిస్తూ వరండాలో నిలబడ్డాడు జగన్నాథం. జానకి గేటు దాటి రోడ్డుమీదికెళ్ళి కారు యెక్కింది.

౬

విగ్గులు కట్టుకోవలెనా? రంగులు పూసుకోవలెనా? పూలు ముడుచుకోవలెనా? సొమ్ములు పెట్టుకోవలెనా? చీరె సింగారించుకోవలెనా? మగవానికైతే యీ పాట్లు. వచ్చే రావడంతోటే జానకి రంగస్థలాన మెఱుపులాగా పొడసూపింది. అటు పాత్రపోషణకూ, ఇటు సాధ్వీధర్మానికీ భంగంలేకుండా నెమ్మదిగా అభినయించడం ఆరంభించింది. నాయిక పాత్రధారి కూడా ఆమె చిత్తమెఱిగి స్త్రీ వేషధారులైన పురుషులతో వ్యవహరించినట్లు విచ్చలవిడిగా ప్రవర్తింపక మెలకువగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. వారిరువురి ప్రవర్తనా ప్రేక్షక లోకాన్ని రంజింపజేసింది. అయితే నాటకమంతటా ఒక్క విధంగా అంటీ ముట్టకుండా ఉండటానికి సాధ్యమా? సత్యవంతుడు అడవిలో చెట్టు కొట్టాడు, పడిపోతున్నాడు. అతనిని తన కోమల కరాబ్జాలతో పట్టుకొని తొడమీద పడుకోపెట్టుకోవాలె. జానకి ఒడలు జలదరించింది. ఏదో గొప్ప తప్పుపని చేయబోయే దానివలె అలమటించింది; ఒళ్ళు ముచ్చెమటలు పోసినవి.

'నా పెనిమిటి సుఖంగా ఉండగా నే నీతన్ని తొడ మీద పడుకోబెట్టుకొని మొగుడు పోయిన మగువలాగా ఏడవాలె కాబోలు' అని కన్నీరు నించింది. పురుషశాసనం రాజశాసనంకంటె కఠినమైంది. లేకపోతే నన్నీ రంగస్థలంమీద అభినయించి తీరాలెనని నా భర్త శాసించడమేమిటి? నేను రావడమేమిటి? ఏమిటి సబబు? దుశ్శాసనాలుగూడా అనుల్లంఘనీయాలేనా? వీటిని అతిక్రమించినా సాధ్వీ ధర్మానికి లోపమేనా? ఇంతకూ ఒట్టు నన్ను బంధించింది. అదైనా యితరమైందికాదు. తన ప్రాణంమీదనే పెట్టుకున్నారు. వారి ప్రాణంకంటె నా కెక్కువైందేమిటి? అందుకే యీ నీచ కృత్యాని కొప్పుకున్నా. ఈశ్వరుడు నాపతికి దీర్ఘాయువునిచ్చుగాక. ఈ ఓగాయిత్యం నన్నంట కుండునుగాక! అని, అనుకుంటూ అశ్రువులు విడుస్తూ విధిలేక జానకి అంటే, సావిత్రి సత్యవంతుణ్ణి తన తొడలపై చేర్చుకున్నది ఆ సమయంలో ప్రేక్షకులకు కావలసిందేమిటి? బాగా ఏడవటమే ఏ కారణం చేతనైతేనేమి ఆ దుఃఖరసం బాగా పోషించి ప్రేక్షకుల మెప్పు పొందింది జానకి. ఇంతలో యముడు వచ్చాడు సత్యవంతుని నెమ్మదిగా ఊరువులమీదినుంచి దించి యముడికి నమస్కారం చేసింది సావిత్రి. ఆపై సావిత్రీ యముల సంభాషణ ప్రేక్షకుల నత్యంతంగా ఆకర్షించింది. తన కళావైదగ్ధ్యమంతా గుప్పించింది జానకి యీ రంగంలో.

౭

జానకి నాటకశాలకు వెళ్ళిన కొంచెంసేపటికే బాబు లేచాడు. తల్లికోసం నాల్గువైపులా చూచాడు. తల్లి కన్పడ లేదు. ఏడ్చాడు. ఆ ఏడ్పుకు ఉయ్యాలకిందనే పడుకొన్న అచ్చికి మెలకువ రాలేదుగాని ఆంగోళనగా పడుకున్న జగన్నాథానికి చప్పున మెలకువ వచ్చింది. చివాలున లేచి బిడ్డను చేతికి తీసుకున్నాడు. 'బాబూ, ఏడవకు' అని బుజ్జగిస్తూ బుజాన వేసుకున్నాడు. కాని తలవంచి బుజానపడుకోలేదు బాబు. పాము పడగలాగ తలెత్తి నాల్గువంకలా చూస్తాడు; నాన్నవంక చూస్తాడు. ఏడుస్తాడు. ఎన్నివిధాల ఓదార్చినా బాబు ఏడ్పు మానలేదు. ఇక ఓదార్చడం చేతగాక జగన్నాథం అచ్చిని లేపాడు. అదీ కుర్రదే. ఒక గంటసేపు లేపగా లేపగా కళ్ళు నులుముకుంటూ లేచి పిల్లవాణ్ణి యెత్తుకున్నది: చల్లగాలిలో అటూఇటూ తిప్పింది. ఆటవస్తువులుచూపించింది. ఉయ్యాల్లో వేసి ఊపింది. ఏంజేసినా బాబు ఏడ్పుమానలేదు. 'పోనీ పాలు పోస్తాను ఉండవే; ఆకలై ఏడుస్తున్నాడేమో' నని జగన్నాథం గ్లాస్కో డబ్బీ, వేడినీళ్ళ సీసా, వెండిగిన్నె, చెంచా, కొమ్ముచెంబూ అన్నీ పోగేసుకొని కూర్చున్నాడు. కాని ఎంతపిండో, ఎన్నినీళ్ళో, ఎట్లా కలపాలో ఏమీ తెలియదు. ఒకమాటు కలిపాడు. పాలు నీళ్ళలాగున్నాయి. నీళ్ళెక్కువైనాయి అనుకున్నాడు. ఇంకా కొంచెం పిండి పోశాడు. 'అయ్యో! యీమాటు పాలుచిక్కనైనాయే' అనుకున్నాడు.

మళ్ళీ కొంచెం నీళ్ళుపోశాడు. మళ్ళీ కొంచెం పిండి వేశాడు, అటుచేసి, ఇటుచేసి పెద్దగిన్నెడు పాలైనాయి. గాని మనస్సుకు సమాధానం లేదు. మనసులో ఏదో ఆందోళనా, అవతల పిల్లవాడి ఏడుపూ, పాలు ఏ తీరున కల పాలో తెలియకపోవడం, ఏదో కంగారు పడుతూ చెరిసగం పాలు క్రిందపోస్తూ, పాలు తయారుచేశాడు జగన్నాథం. కాని పోయడమెట్లా? తల్లిపాలకు అలవాటుపడ్డ పిల్లలు డబ్బాపాలు మూచూస్తారా? బాబును తొడమీద కూర్చోబెట్టుకొని కొమ్ముచెంబులో పాలుపోసి కొమ్ముకు పీకబెట్టి నోట్లోబెట్టి త్రాగించబోయినాడు. వాటిముఖం ఎప్పుడూ చూడని బాబు నోరుగట్టిగా మూసుకొని కొమ్ముచెంబు చేత్తో తోసేసి, పెద్దగా యేడవటం మొదలు పెట్టాడు. పోనీ పీకతో త్రాగ డేమోనని గిన్నెలో పోసి యిచ్చాడు. అవీ నెట్టేశాడు. 'ఇది గాదు త్రోవ. కాళ్ళమీద వేసుకొని పోస్తాఉండు' అని జగన్నాథం కాళ్లమీద పిల్లవాడిని వేసుకొని స్పూనుతో పాలు నోట్లో పోయబోయినాడు. కాళ్లూ చేతులూ విసురుకుంటూ, గిలగిల కొట్టుకొని నోట్లోపోసిన పాలు తెమడచేసి కక్కడం మొదలుపెట్టాడు బాబు. చేతితో తోసివెయ్యడంచేత గిన్నె చెంచా అంతదూరాన పోయిపడ్డాయి. కాలి విసురుకు థర్మాసు ఫ్లాస్కు నేలబడి ముక్కలు ముక్కలై పోయింది. జగన్నాథా నికి పట్టరాని కోపంవచ్చింది. సహనం కోల్పోయినాడు 'పసి' వాడే, తాళుతాడా, అనుకోకుండా ఛెళ్ళున వీపుమీద ఒక

దెబ్బవేశాడు బాబును. ఆ దెబ్బకు బాబు కేరుమని ఒక్క బొబ్బపెట్టి వెన్నువిల్లువంపుగా వంచుకొని ఏడ్చి, ఎటు చూచినా తల్లి కనిపించకపోవడంచేత మళ్ళీ తండ్రి కాళ్ళకే చుట్టుకున్నాడు. ఆ పిల్లవాడిని చూసేటప్పటికి జగన్నాథం కడుపు తరుక్కుపోయింది. కన్నులవెంట నీళ్ళు బొటబొటా వచ్చాయి. బిడ్డను చప్పున చేతులకు తీసుకొని 'నాయనా ఎంత దుర్మార్గుణ్ణిరా, ఈ పాడుచేతులతో యెంత దెబ్బ కొట్టానురా' అని గుండెలకు అదుముకున్నాడు. 'నీ తల్లి నీ సొత్తు. నీ తల్లిదగ్గర నీవు పాలు త్రాగడం నీ జన్మహక్కు. నీ హక్కును నేను భంగపుచ్చినప్పుడు నీవీమాత్రం పోరాడడం తప్పా? బాబూ తప్పుచేశాను ఏడవకు నాన్నా! ఏడవకు. అదిగో రెండు గంటలైంది. మీ అమ్మ వస్తుంది. బొజ్జనిండా పాలిస్తుంది' అని బుజ్జగిస్తూ పిల్లవాడ్ని బుజాన వేసుకొని వరండాలో పచారుచేయడం మొదలుపెట్టాడు. ఎన్నడూ యెఱుగని అయ్యగారి కోపం, చికాకూ, గడబిడా చూచి హడలిపోయి అచ్చి గోడకంటుకుంది.

౮

పసిబిడ్డతల్లికి తలమునక పనిలో వున్నా బిడ్డమీదనే కన్ను. ఉత్సవానికి పోనీ, ఊరేగింపుకు పోనీ, పేత్తనానికిపోనీ, పేరంటానికి పోనీ, కూలికిపోనీ, కూటికిపోనీ, ఒక్కక్షణం నిలువదు. 'పాలు త్రాగేబిడ్డను వదలి వచ్చాను యింట్లో. ఒక్క

క్షణం నిలవడానికి వీలులేదు పోవాలె పోవాలె. బిడ్డ కక్కుటిల్లి పోతుండాలె, గొంతెండిపోతుందేమో' ఇదే ఆత్రం. జానకి ప్రాణంగూడా యిల్లాగే తపించి పోతున్నది. ఆమె ప్రాణమంతా బాబువద్ద. బొంది మాత్రం రంగస్థలంలో. నాటకం యెట్లాగో ముగించేసి మంగళగీతం పాడకుండగానే కారెక్కి వచ్చేసింది జానకి. జగన్నాథం యింకా పిల్లవాడ్ని బుజాన వేసుకొని చిచ్చికొడ్తూ పచారుచేస్తూనే ఉన్నాడు. జానకి భర్తను చూడగానే 'ఏమి ఎత్తుకుని తిప్పుతున్నారే' 'ఏడుస్తున్నాడా' అంటూ బిడ్డను చేతికి తీసుకొన్నది. 'అనుకుంటూనే ఉన్నా. పిల్లవాడులేచి యేడుస్తున్నాడేమో? వేసంకాలమే, గొంతెండుతుందే అని, తొందర తొందరగా వద్దామన్నా వీలుకాలేదు. ఏమిబాబు, అర్ధరాత్రివేళ నాన్నగారిని వేధిస్తున్నావా; అని యేమేమో బుజ్జగింపు మాటలాడుతూ పిల్లవాడికి పాలివ్వటం మొదలు పెట్టింది జానకి. ఆయేడుపూ ఆ మొక్కు, ఆ పెంకెతనం అంతా ఎమైపోయిందో కిలాకిలా నవ్వుకుంటూ కాళ్ళూ చేతులూ ఆడించుకొంటూ మహా సంతోషంతో పాలు త్రాగటం ఆరంభించాడు బాబు. ఆ మాతాశిశువుల. అవిచ్ఛేదమైన సంబంధం, ఆ తల్లియొక్క ఆత్రం, ఆ బిడ్డయొక్క ఆనందంచూచి, సంసారంలో అనుభవ పూర్వకంగా నేర్చుకోవలసింది చాలా వున్నది. ఊహా ప్రపంచంలో సులభంగా ఉన్నాయనుకొన్న యేర్పాట్లు క్రియా ప్రపంచంలోకి తేవడం సామాన్యకార్యంగాదు అనుకొన్నాడు

జగన్నాధం. బిడ్డకు పాలిచ్చుకుంటూ అకల్మషురాలగు జానకి 'బాబు నేను వెళ్ళంగానే లేచాడా? పాలుపోశారా? త్రాగాడా? ఏమీ నిద్రపోలేదూ ?' అంటూ పెనిమిటిని ఎన్నో ప్రశ్నలు వేసింది విసుగునో సిగ్గునో, జగన్నాధం సరిగా జవాబు చెప్పలేదు కాని జానకి యింట్లోకి వెళ్ళంగానే కలిపిన పాల గిన్నెలూ, ఒలికినపాలూ, పగిలిన వేడినీళ్ళసీసా, మొదలైనవన్నీ బాబు చేసిన అల్లరీ పెనిమిటిబడ్డపాట్లూ చెప్పకుండా చెప్పినవి తన భర్త చాల శ్రమపడ్డాడు కాబోలునని విచారించింది జానకి

౯

మఱునాడు కళాసంఘంవారు తమ ఏర్పాటు ప్రకారం ఏలూరు వెళ్ళారు. పాదుకాపట్టాభిషేక ప్రదర్శనానికి సర్వ సన్నాహాలూ పూర్తిఅయినాయి. దానిలో జానకి కైక వేషం వెయ్యాలె. శాశ్వతంగా లోకనిందకు పాత్రలైన స్త్రీలలో కైక అగ్రగణ్యురాలు సరళస్వభావ యగు జానకికి కైక పాత్ర ధారణం దుస్సహనమనిపించింది. అయినా తప్పేమున్నది. తన ప్రాణేశ్వరున కొసగిన వాగ్దానం చెల్లించుకోవాలె గదా. ఆ క్రిందటి రాత్రి బాబుతో పడ్డ కష్టం తలచి జగన్నాధం భార్యను నాటకానికి పంపడమంటే భయపడ్డాడు. కాని కాదంటే సమితివారిచే మాటవస్తుందని, మిత్రులు అపహాస్యం చేస్తారని అనుకొని మాట్లాడకుండా ఊరుకున్నాడు మామూలుగా తొమ్మిది గంటలకు జానకి నాటక శాలకు వెళ్ళింది.

హోటలునుంచి అన్నంరావడం ఆలస్యమైనందున అన్నం తినకుండానే నిద్రపోయిన లీల తల్లి అట్లావెళ్ళగానే నిద్రలేచి 'నాన్నా ! మా అమ్మేది' అన్నది.

అట్లా వెళ్ళింది. వస్తుంది. ఏం ఆకలేస్తున్నదా ? అన్నం పెట్టనా' అన్నాడు తండ్రి.

'అమ్మచేత పెట్టించుకుంటా.'

'అమ్మ యిప్పుడు రాదు.'

'అమ్మ దగ్గరికి పోతా.'

'అమ్మ దొడ్లోకి వెళ్ళింది.'

'నాకూ దొడ్డికి వస్తున్నది.'

'వస్తే అచ్చి అరుగుకిందకి తీసుకుపోతుంది పో.'

'అయితే రాటంలే; మా అమ్మేది?'

'మీ అమ్మ యెక్కడికో పోయింది.'

'అయితే నాకు బువ్వ యెవరు పెట్టుతారు?'

'నేను'

'ఛీ! నాన్నలు బువ్వపెట్టుతారా, ఎక్కడన్నా?'

'పెడ్తారులే, రా'

'ఊహూ. నాకు అమ్మేకావాలె.'

లీల సన్నగా యేడ్పుసాగించింది. ఆ సడికి బాబుగూడా లేచి యేడ్పు సాగిస్తాడేమోనని భయపడి జగన్నాధం లీలకు బిస్కట్లుపెట్టి, వేడిపాలల్లో కొంచెం కలకండవేసి త్రాగించి ఎత్తుకొని తిరగడం ప్రారంభించాడు. బాబు చేసిన ఆగం చేయకపోయినా లీల మాటిమాటికీ 'మా అమ్మేది?' మా అమ్మేదీ అని అడుగుతూ, యే వేవో ప్రశ్నలువేస్తూ తండ్రిని విసిగించి వదిలిపెట్టింది. లీలతోనే విసుగుతూ వుండగా ఒంటిగంట అయ్యేసరికి బాబుగూడా నిద్రలేచాడు. బాబు లేచాడా అంటే తారాజువ్వ; చంకకు రాడు; చేతిలో ఉండడు; ఉయ్యాల్లో పండుకోడు; పాలుపట్టితే త్రాగడు. జగన్నాధం లీలనుదించి బాబును యెత్తుకున్నాడు. అదివరకే ఏడవటానికి చూస్తున్న లీల తండ్రి కిందికి దించిన ఆ అవకాశం చూచుకొని బ్యారుమని యేడవటం మొదలుపెట్టింది. పోగు పెట్టియేడవటంలో పూర్ణప్రజ్ఞుడనిపించుకున్న బాబు అక్కకు సాయమైనాడు. ఒక్కనేరస్తుణ్ణి ఇద్దరు అధికారులు ఒక్కమాటే శిక్షించడానికి పూనుకున్నప్పుడు పాపం ఎంత సహనంగల అపరాధి అయినా ఏమిచేస్తాడు? పాపం, యేడ్చే పిల్లలిద్దరి మధ్యా జగన్నాధం నిర్వికారంగా నిలబడ్డాడు. వాళ్ళను ఎట్లా ఓదార్చాలో అతనికి తెలియలేదు. 'ఒకొక్కతల్లి అయిదారుగురు బిడ్డలను సులభంగా సముదాయించుకుంటుంది. ఆహా! మాతృమూర్తియందెట్టి సహనసామర్థ్యాలు గర్భితమైయున్నవో ! ఆశ్చర్యం ! పురుషుడీవిషయంలో ప్రధమపాత

మైనా వర్ణించిఉండలేదు' అని యే వేవో భావాలు అతని హృదయాకాశాన జ్యోతిష్మతీ లతలవలె మెఱవడం మొదలు పెట్టినాయి. కాని మాతాపితల సామర్థ్యాసామర్థ్యాలు విచారించి చర్చించి పర్యవసానం తేల్చుకోడానికది సమయమా? తండ్రి యెత్తుకున్నా నిలవకుండా బాబుయేడుస్తుంటే 'నన్ను కూడా యెత్తుకో' మని కాళ్ళకు చేతులు మెలివేసి నిలబెట్టింది లీల. లీల చేస్తున్న మంకుతనానికి ఒక్కదెబ్బ వేద్దామా అని పించింది జగన్నాథానికి. కాని ఆ క్రిందటిరోజున బాబును కొట్టినందుకే పశ్చాత్తాప పడుతున్నాడుగనుక, లీలను కొట్టడానికి చెయ్యిరాలేదు, వాళ్ళతల్లిని వాళ్ళదగ్గర లేకుండా చేసిన దోషం తనదైనప్పుడు ఎట్లాకొట్తాడు?

'నానీ నిన్ను అచ్చి యెత్తుకొంటుంది. ఏడవకు. నా మాట వినవూ? నీకు బొమ్మలూ, మిఠాయిలూ కొని పెట్టవద్దూ?'

'కొత్తచొక్కాలో?'

'ఆ, కొత్తచొక్కాలూనూ?'

'బొమ్మల పుస్తకం?'

'అదిగూడా. అన్నీ కొనిపెడ్తా ఏడవకుండా వుంటే.'

'ఏడవను అమ్మను చూపించూ'

'అదిగో రెండు గంటలైంది. మీ అమ్మ కారెక్కి వస్తుంది.

'ఎక్కడకు పోయింది?'

'బజారుకి'

'నన్ను తీసుకుపోలేదేం ?'

'తమ్ముడూ నీవూ దోబూచులాడుకోండి.'

గేటువద్ద హారన్ ధ్వని వినబడ్డది 'నాన్నా ! కారొచ్చింది. అమ్మరాలేదేం ?'

'అదిగో వస్తున్నది చూడూ.'

'ఆఁ ఆఁ అదిగో, అదుగోఅమ్మ వస్తున్నది. అమ్మవస్తున్నది' అని లీల చప్పట్లు కొట్టుచున్నది. బాబు ఏడుపంతా మాని కిలకిలా నవ్వుతూ అక్కతోబాటు చప్పట్లు కొట్టుతున్నాడు; మహోల్లాసంతో బిడ్డలిద్దఱూ స్వాగతమిస్తూ ఉండగా జానకి వరండాచీడీ లెక్కింది. బాబు చేతుల్లో దూకాడు. జానకి అక్కడే గోడ నానుకొని కూర్చున్నది. తల్లి మెడలోని స్వర్ణహారాలు చేతులతో లాగుతూ కాళ్ళూపుతూ బాబు పాలు త్రాగుతుంటే 'నన్ను తీసుకుపోకుండా నీ వెందుకు బజారునకు పోయినావుచెప్పూ' అని మారాము చేస్తూ ప్రక్కనుంచి తల్లిబుజముపై తలమోపి రుద్దుతున్నది లీల. జగన్నాథం ఆ విచిత్రం చూస్తూ తెల్లబోయి నిలబడ్డాడు.

౧౦

మూడవ ఆటకు నాటక సంఘంవారు రాజమండ్రి చేరారు. జమీందారుగారి బంగాళాలో వారి విడిది. ఆనాటి

నాటకం సారంగధర. జానకి ఆనాడు చిత్రాంగి వేషం వెయ్యాలె. సారంగధర నాటకంచూచే ప్రతివారికీ తప్పెవరిదనే సందేహం తప్పకుండా కలిగితీరుతుంది

న్యాయం రాజరాజనరేంద్రుడిదే ముమ్మాటికీ తప్పుంటుంది. నీతి చిత్రాంగిదే తప్పుంటుంది. అయితే కొడుకు పటంచూపి తాను పెండ్లాడిన రాజరాజనరేంద్రుని దుష్కృత్యాన్ని ఎవరూ అనుకోరు. తాను రూపపటమందు చూచిన యువకునియందే అనురాగం కలిగి ఉండిన చిత్రాంగిని దూషిస్తుంది లోకం. మానవజీవితంలో నీతి అతి ప్రాముఖ్యమైన విషయం. నీతిని విడనాడి ఎవరు, ఎంతటివారు లోకంలో మంచి వారనిపించుకోలేరు. మానవుల జీవితోన్నతి నీతి సూత్రంచేత నిబద్ధమై ఉన్నది. అది ఒక్కొక్క పట్టులో అవలంబించడానికి కష్టమైనప్పటికి విడవడానికి వీలుగానిది కాబట్టే చిత్రాంగి లోకదూషణకు గురైంది.

'రాజరాజనరేంద్రుడు చేసింది తప్పే అనుకో. అయిందేమో అయింది. తాను నీతిగా ఉండరాదూ.' చిత్రాంగిని లోకం మందలించే దిందుకు. కనుక లోకంలో పవిత్రమైన నీతికి ప్రాముఖ్యత ఉన్నన్నాళ్ళూ చిత్రాంగి మంచి కనపడదు. అందులో గోరంతలు కొండంతలుగా వ్రాయ నలవాటుపడ్డ మన కవులు తమ వెట్టిమొట్టి వర్ణనలతో చిత్రాంగికి మరీ మాలిన్యం కలిగించారు. కాబట్టే లోకంలో విలాసాతివిలా

సంగా తిరిగే దుర్జాతి స్త్రీలను 'అదోక చిత్రాంగి' అనడం లోక సాధారణం అయిపోయింది. శ్రవ్య కావ్యాల్లో చిత్రాంగి ధార్ష్ట్యం ఎంత హద్దుమీరినా భయంలేదు కాని దృశ్య కావ్యాల్లో చిత్రాంగి మోహ వ్యవహారం హద్దుమీరించడం నటకులకు ప్రాణకంటకం.

అందులో ఒక కులాంగన ఆ పాత్రధారణ చెయ్యాలంటే అది సామాన్యమైన కష్టంకాదు. చిత్రాంగిపార్టు వల్లించిందేగాని దానిని అభినయించడమెల్లాగని జానకి లో లోపల క్షోభిల్లిపోతున్నది. పరమ సాధుశీలుడగు నొకపురుషుని తానే ప్రణయ వ్యవహారాలకు ప్రేరేపించుతూ నానా అసభ్య క్రియలూ చెయ్యాలె. ఒక మానవతి యీ పాత్రధారణం చెయ్యడమెట్లా? సారంగధరలో ఆ శయ్యారంగంలోని ప్రతి పదమూ జానకి ప్రాణాన్ని ఆర్చివేస్తున్నది క్షుభితసాగరంవలే ఉన్న హృదయంతో 'ఆయనవద్దు అనేవరకు నేనీ నీచకృత్యం చేయక తప్పదు. నే నేమిచేయను? ఆ ఒట్టు నన్ను కట్టివేసింది. ఇది నా పతివ్రతా ధర్మాల్లో ఒక ధర్మాచరణం. దీనివల్ల నా నిర్మల శీలానికి యెగ్గురాకుండుగాక. నా సర్వస్వం భర్తకు సమర్పించాను. ఈ శరీరం ఆయనదికాని నాదికాదు. కాబట్టి యీ తనువును ఆయన యెన్నెన్నివిధాలా వినియోగించుకొని ఆనందించాలంటే అన్నన్నివిధాలా వినియోగపడి ఆయనను సంతోషపెట్టడమే నా ధర్మం' అని తాము బసచేసిన బంగాళా వరండాలో కూర్చొని ఆలోచిస్తున్నది జానకి.

జగన్నాథంగూడా ఆ వరండాలోనే జానకికి సమీపం గానే పచారుచేస్తున్నాడు. అతనూ భార్యవంక చూస్తున్నాడు. ఏమో ఆలోచిస్తున్నాడు. జానకి మామూలుగా లేదని తెలుసుకున్నాడు. బహుశా నాటి చిత్రాంగి పాత్రాభినయమే ఆమెను కలవర పెట్టుతున్నట్టుందనికూడా గ్రహించాడు. 'జానకికి చాలా మనోవ్యధ కలిగిస్తున్నా'నని కూడా అతనికి తోచింది. తన్ను సర్వవిధాలా పోషించి రక్షిస్తాడనేగదా స్త్రీ తన్ను పురుషుడికి సమర్పించుకుంటుంది. ఆ విధంగా తన్నే నమ్ముకున్న సతిని పురుషుడిట్టి అనుచిత కార్యములకు విని యోగింపవచ్చునా? ఇది పురుషుడు తన భర్తృత్వాధికారం దుర్వినియోగం చేయడం కాదా?

అయిందేమో అయింది. ఇంతటితో మానివ్వేస్తే ఏమి? తీర్మానం తెచ్చింది తాను; నెగ్గించింది తాను; ఆచరణలో పెట్టింది తాను; ఇప్పుడు వెనకతీసిందిగూడా తానే అయితే నల్లురూ నవ్వరూ? కాని 'వాళ్ళ నవ్వుకోసం నా భార్యనిట్లా యెంతకాలం హింసించేది? బిడ్డల నెన్నాళ్ళు అల్లాడపెట్టేది? నే నెన్నాళ్ళు అవస్థ పడేది? అబ్బా! ఒక్కొకరాత్రి వేగించే టప్పటికి తలప్రాణం తోకకు వస్తున్నదే! పిల్లలు చెడిపొయ్యే టట్లున్నారే! జానకిగూడ నిద్రలేకపోవడంచేత కాబోలు, శిరోవేదనతో బాధపడుచున్నదే? ఏమిటీ ఘోరం! నా కళోన్మాదానికి నా భార్యాబిడ్డలను బలిపెట్టనా? అని యోచి స్తున్నాడు జగన్నాథం. ఇంతలో 'అబ్బాయిగారేడుస్తున్నా

రండీ, ఎంత ఊరుకోబెట్టినా ఊరుకోవడంలేదండి; ఒళ్ళు కూడా వెచ్చగా ఉందండీ' అంటూ ఆ అచ్చి పిల్లవాడిని జానకి వద్దకు తీసుకొస్తూ అన్నమాట జానకీ జగన్నాథంల చెవుల్లో ఒక్కమారుగా చురుక్కున తగిలింది. 'ఏమే, ఒళ్ళు వెచ్చబడ్డదా!' అంటూ ఆత్రంతో బిడ్డను చేతికి తీసుకుంటూ ఉండగానే తటాలునవచ్చి పిల్లవాని ఒంటిపై చెయ్యిపెట్టి చూచి 'ఆ జ్వరమే! ఒళ్ళుకాగా వెచ్చగావుంది' అన్నాడు నెమ్మదిగా దిగులుతో జగన్నాథం,

'ఎండలూ, ప్రయాణం, ఊరిఊరి నీళ్ళుతాగడం పిల్లవాడికి జబ్బు చేస్తుందని అనుకుంటూనే ఉన్నా. అట్లాగే జరిగింది.'

'రాత్రిళ్ళు నిద్రకూడా లేదు.'

'నిజమే.'

'రాత్రికి నీవు ఆటకి వెళ్ళాలిగా?'

'వెళ్ళొద్దూ?'

'పిల్లవాడిని పట్టుకోవడం కష్టమేమో?'

'ఆఁ. కష్టమే.'

'అయితే ఈపూట ఆటకు వెళ్ళడం మానితేసరి.'

'సర్వ సన్నాహాలు చేసుకొని ఊరంతా ప్రకటన

పత్రాలుపంచి మూడు రోజులనుండి టిక్కట్లు అమ్ముతూ ఇప్పుడు మానితే బాగుంటుందా? ఎంతగోల అవుతుంది?'

చిన్నబోయిన ముఖంతో ఆకాశంవంకచూస్తూ 'ఇది మూడో ఆట' అన్నాడు జగన్నాథం భారంగా.

'అవును. ఈ రాత్రి ఎట్లాగో గడిపితే' అన్నది జానకి.

౧౧

రాత్రి తొమ్మిదిన్నర గంటలకు యథాప్రకారంగా జానకిని నాటకశాలకు తీసుకుపోవడానికి కారు వచ్చింది. ఎంతధైర్యం తెచ్చుకున్నా జానకికి నాటకశాలకు పోవడానికి కాళ్ళాడలేదు ముమ్మారులోపలికిపోయి, ముమ్మారు బయటికి వచ్చింది. పిల్లవాడిని పట్టి పట్టి చూచింది. బిడ్డ ఉలిక్కి పడుతున్నాడు. కలవరిస్తున్నాడు. 'జ్వరం తీవ్రంగా ఉన్నది. ఎట్లా వదిలిపెట్టిపోను' అనుకున్నది. పెనిమిటివంక చూచింది. 'ఎందుకు ఆలస్యం చేస్తావు?' అన్నాడు జగన్నాథం.

'ఏమీలేదు. కాక తగిలితే పిల్లలు ఆదమరచి నిద్ర పోరు. పోరుపెట్టి యేడుస్తారు. మీరు ఎట్లా ఓదారుస్తారా అని సందేహిస్తున్నా.'

'భయంలేదు. ఏదో విధంగా చూస్తా పో,'

'ఈ రాత్రి కారు యిక్కడే ఉంటుంది. బాబు లేచి ఏడిస్తే కారు పంపించండి తక్షణం వస్తా.'

'అప్పుడు నీవు రాజరాజ నరేంద్రుని మహలులో ఉంటావేమో '

'ఆ మహలుకు పంపించింది మీరేగా ? మీ ఒట్టే నాకు చరణ శృంఖలం కాకపోతే నా చిన్న బాబును ఈ సమయంలో విడవమన్నా విడుతునా? నా బిడ్డను చూచుకోవడం కంటే నాట్యరంగం నాకెక్కువగాదు. ఈ బొంది యెక్కడ ఉన్నా నేను మీ అంతరంగంలోనే' అన్నది జానకి. జగన్నాధం సిగ్గుతో మారుమాట్లాడకుండా తల నేలకు వంచుకున్నాడు. జానకి వెళ్లి కారు యెక్కింది.

౧౨

నాటకశాలకు వచ్చిందన్న మాటేగాని జానకి మనసులో మనసులేదు. తన ప్రియపుత్రుడైన బాబుకు జ్వరం రావడం, తాను దుష్టమైన చిత్రాంగి పాత్రధారణ చేయవలసి యుండడం, రెండూ రెండు రంపాలలాగా ఆమె హృదయాన్ని కోసివేస్తున్నవి. సారంగధర నాటకంలోని ఆ వలపు గీతాలు, ఆ విరహ వాక్యాలు తలుచుకుంటే ఆమెకు శరీరం కంపరమెత్తిపోతున్నది; అవయవాలు పట్టు తప్పిపోతున్నవి ఎట్లావున్నా కర్తవ్యం ఒకటి ముందుకు నెట్టడం చేత ఎలాగో కాళ్ళు నిలవత్రొక్కుకొని స్టేజీమీదికొచ్చింది. పద్యంవంతు వచ్చింది. ఆరంభించింది.

చ॥ అనదవిధంబు వాటిలె ననుంగుని బా... కి... నో... జాలనీ
యెనిమిదినాళ్లు నొక్కగతినేడ్చుచు బాపితినిం కదా... నా
మనసిజరూపవై భవుని మానవతీ నవమోహనాంగునిన్
దినకర తేజునిన్ విభవ దివ్యబిడౌజుని గూ... ...॥

అని పాడింది. సాధ్వీధర్మానికి కళంకం తెచ్చే ప్రత్యక్షరం జానకినోట వెలువడక అప్రయత్నంగా లుప్తమై పోయింది. జానకి పద్యపఠనా వైఖరి ప్రేక్షకులకు అసహ్యమై పోయింది. 'ఇంత తెత్తితే అనే జానవు రంగాని కెందు కొచ్చావు? 'ఏ' అని అరుస్తూ జనమంత గొల్లున గోలెత్తి చప్పట్లు కొట్టారు. జానకి తలపై పిడుగు పడ్డట్టయింది. నిర్ఘాంతపోయి నిర్జీవ ప్రతిమలాగా అయిపోయింది. కొంత సేపటికిగాని కళ్ళ వెంటనైనా నీళ్ళురాలేదు. తల నేలకు వంచుకుంది. కన్నీళ్ళు బొటబొట నేలమీద పడుతున్నాయి. తిన్నగా నేపథ్యంలోకి వెళ్ళిపోయింది. 'వారంరోజులనుంచీ పత్రికలు ఈమె అభినయాన్ని గురించి పడ వ్రాస్తుంటే వచ్చాము. ఆ వ్రాసినవాళ్ళెవరూ ఈమె అభినయం చూచినట్టులేదు. అయ్యో! అర్ధరూపాయి దండుగ, రూపాయి నష్టం. మూడు రూపాయలు పాడు. ఇవ్వాళ మా కుటుంబానికంతా మొత్తం టిక్కెట్లక్రింద ఇరవై రూపాయలు మసి' అని యెవరు పెట్టిన దండుగ వాళ్ళు ఏకరువు పెట్టుకుంటున్నారు. 'ఆట ఆపేశారా! అయితే మా డబ్బు పారేయండ' డంటున్నారు. తక్కువరకం టిక్కెట్లు కొన్నవాళ్ళే ఎక్కువ అల్లరి చేస్తున్నారు.

'గొంగట్లో అన్నం పెట్టుకొని వెంట్రుకలు వచ్చి నాయి అని అసహ్యపడితే ప్రయోజన మేమిటి' అనుకొని ప్రేక్షకుల అల్లరిచే కడు నొచ్చిపోయిన జానకి ఎట్లాగో కొంచెం ధైర్యం తెచ్చుకొని మళ్ళీ స్టేజీమీదకొచ్చింది. కాని ఆ అసభ్యపదాలు చర్చింపలేక మాటిమాటికి నాలుకయెదురు తిరుగుతూనే ఉన్నది. ఆడియన్సు అల్లరి చేస్తూనే ఉన్నారు.

## ౧౩

బాబుకు నిద్రలేదు. క్షణక్షణానికి జ్వరం హెచ్చిపోతున్నది. కొలిమితిత్తుల్లోంచి వచ్చినట్లు ముక్కుల్లోంచి వెచ్చని శ్వాస వస్తున్నది. 'ఊఁఊఁ' అని పెద్దవాళ్ళు మూలిగినట్లు మూలుగుతున్నాడు. నడుమ నడుమ ఉలికి పడుతున్నాడు; ఏడుస్తున్నాడు; జగన్నాథం గుండె లవిసిపోతున్నవి. ఆ పిల్లవాడి బాధ చూడలేకుండా ఉన్నాడు. బాబుకు యెదురుగా కుర్చీ వేసుకొని కూర్చోడానికికూడా అతనికి భయం వేసింది. 'తల్లిదగ్గిరవుంటే యేమిచేసేదో! డాక్టరును పిల్చుకొస్తామన్నా పిల్లవాడివద్ద ఉండేవాళ్ళెవరూ లేరు ఏమిటి కర్తవ్యం?' అని క్షణమాలోచించాడు జగన్నాథం. జానకి పిల్లవాడు యెప్పుడు యేడిస్తే అప్పుడు తీసుకురమ్మన్నదికదా. ఏమైతే అదే అవుతుంది. పిల్లవాడిని తీసుకొని అక్కడికే పోదామనుకున్నాడు.

అచ్చి, లీలా లోపల నిద్రపోతున్నారు. అచ్చినిలేపితే లీలకూడా లేస్తుందేమోనని భయం. అందువల్ల అచ్చినికూడా

లేపకుండా పిల్లవాడిని బుజాన పడుకోబెట్టుకొని మెల్లగా బయటికివచ్చి తలుపువేసి తాళంనొక్కి కారులో నిద్రబో తున్న డ్రైవరును లేపి, 'కారు సిద్ధంచేయవోయి' అన్నాడు జగన్నాథం. కళ్ళునులుము కొంటూ లేచి 'సిద్ధంగానే ఉన్నది మహారాజ్. దయచేయండం' డన్నాడు డ్రైవరు కాసీమ్. పది నిముషాలలో కారు నాటకశాల చేరింది. ఇంతలో బాబు కొంచెం కూర్కడంచేత పిల్లవాడిని కారులో మెత్తమీద పడుకోబెట్టి 'కాసీమ్, అబ్బాయిని చూస్తూవుండూ. లోపలికి పోయి పరిస్థితులెట్లా వున్నాయో చూస్తా' నన్నాడు జగన్నా థం. 'చిత్తం' మన్నాడు కాసీమ్. జగన్నాథం లోపలికి పోయి నాడు. నాటకం చూడడానికే ప్రొఫెసరుగారు వచ్చారను కొని 'రండి, రండి' అని స్వాగతమిచ్చారు సమితి పెద్ద లందరూ. కాని జగన్నాథం వారిస్వాగతం యేమీ అందు కోకుండానే సరాసరి వెళ్ళిస్టేజీ సమీపంగా ఉండే కుర్చీలవద్ద నిలబడ్డాడు. అప్పుడు చిత్రాంగీ సారంగధరులకు శయ్యాగృహ ములో వాద ప్రతివాదాలు జరుగుతున్నవి. సారంగధరుడు 'శివశివా' అని తొలుగుతూ ఉంటే 'ప్రాణ వల్లభా!' 'యువతీమదనా!' 'మనోరమణా!' అంటూ అతని వెంట నంటి తిరుగుచున్నది చిత్రాంగి. ఆ దృశ్యం చూచేటప్పటికి జగన్నాథానికేమో ఒంటిమీద తేళ్ళూ, జెఱ్ఱులూ ప్రాకినట్లు యింది; మనస్సు మనస్సులో లేదు; ముఖం మీద కళతొలి గింది; కన్నుల్లో తేటపోయింది. వెఱ్ఱిచూపు, వికృతాకారం

అయిపోయి నిలుచున్నాడు. 'సారంగా! కోమలమగు నీ శరీరము, కోమలాతి కోమలమగు నీ ముద్దుమాటలు; అట్టి నీకీ వజ్రహృదయ మెట్లు గలిగె? శూలములబోలు ' నీ మాటలు నాయెద నాట నుద్యమించియు నదేమి దైవా యత్తమో కందుకములబోలె నీయొద్దకే యెదురేగుచున్నవి. నీయాన... నా యానన... ...ఆ... ...మ... ...నాన నిను మానజాలనీ... ...యా... ...శ్లే... ...' అని యే మేమో అంటున్నది: జగన్నాథం నిబ్బరించు కోలేకపోయాడు. చిత్తం వశం తప్పిపోయింది. 'ఆఁ. ఆఁ. జానకీ! ఎంత సాహసాని కొడిగట్టావూ?' అని పెద్ద బొబ్బలు పెట్టుకుంటూ అమాంతంగా స్టేజీమీదకు పరుగెత్తాడు.

హృదయ విదారకమైన ఆ పలుకులువిని జానకి క్రుంగి పోయింది. కనుల వెంట నీళ్ళు బొటబొటా కారుస్తూ గుండె మీద చేయి పెట్టుకొని నేనా యీ సాహసానికి ఒడిగట్టింది. నిజం చెప్పండీ? ఒట్టుబెట్టి వచించి బుద్ధిపూర్వకంగా నన్నీ అగ్నిగుండంలో త్రోసింది మీరుకాదూ' అన్నది దీనంగా. జగన్నాథం ఏమంటాడు? నేరం ఋజువైన అపరాధిలాగా అయిపోయినాడు.

* * * *

కథ కంగారుగా మధ్యలో ఆపివేసి భార్యాభర్తలిద్దరూ పూర్వోత్తర గాథలన్నీ చెప్పుకుంటూఉంటే చూస్తూకోర్చో

టానికి ప్రేక్షకులు బొమ్మరాళ్ళా? రేకులతో కట్టిన నాటకశాల శిలావర్షంతో ధణధణామన్నది చెప్పులు చేతి కర్రలు రెక్కలు వచ్చినట్లు ఎగిరినాయి, ఈలలూ-చప్పట్లూ-కేకలూ ఒకటేమిటి నానా బీభత్సం! ఈ ప్రజాదార్జన్యానికి ఓపలేక సమితివారు టికెట్లరుసుము ఆడియన్సుకు వాపస్‌చేసి ప్రాణం దక్కించుకున్నారు. ఈ మహా గందరగోళములో జగన్నాథం ఎట్లా బయటపడ్డాడో తెలియదు. కాని 'పెళ్ళాంచేత నాటకా లాడించడానికి వచ్చిన ఆ ప్రొఫెసర్‌గారు, సమితితో విడాకులు పుచ్చుకుని రాత్రే సకుటుంబంగా బండి ఎక్కాడటోయి' అని తెల్లవారేప్పటికి ఊరంతా గుప్ మన్నది.